www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 19 | నవంబర్ | 2025
పేజీలు : 8

## విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకునేందుకు ‘ఎవ్రి చైల్డ్ రీడ్స్ యాప్’




-రాష్ట్రంలోనే ప్రత్యేక కార్యక్రమం
-విద్యపై ప్రత్యేక దృష్టి
-జిల్లాలో తొలిసారి ఏర్పాటు చేసిన కలెక్టర్ అనుదీప్
-వైరా మండలంలో విద్యార్థుల రీడింగ్ విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

2 లో

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలతో పురోగమనం



- జనసేవాదళ్ కార్యకర్తలను సిద్దం చేస్తున్నాం
- విపత్కర పరిస్థితిలో అండగా సేవాదళ్
శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ శతవసంతాల ముగింపు సంధర్భంగా ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే భారీ బహిరంగ సభకోసం జిల్లా నుండి జిల్లా నుండి మూడు వేల మంద జన సేవాదళ్ కార్యకర్తలను సిద్దం చేస్తున్నామని ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి కాల్వ భాస్కర్ మామిడి తోటలో ఏర్పాటు చేసిన జనసేవాదళ్ శిక్షణా శిభిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా కూనంనేని మాట్లాడుతూ జన సేవాదళ్ కార్యకర్తలను 80వ, దశకంలోనే సిపిఐ అగ్రనేత చంద్రా రాజేశ్వరరావు ఏర్పాటు చేశారని తెలిపారు. సంక్షోభ సమయంలో, విపత్కర పరిస్థితుల్లో, సామాజిక సేవా కార్యక్రమాల్లో జన సేవాదళ్ కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేండ్లుగా జనం గుండెల్లో నిలిచి మహోన్నతమైన స్థానాన్ని దక్కించుకొందన్నారు. ప్రజా ఉద్యమాలే పోరాటాలు, ఉద్యమాలే సిపిఐ ఆయుధమన్నారు. మనిషిని మనిషి దోపిడీ చేయని సమసమాజ స్థాపన కోసం ఆవిర్భవించిన సిపిఐ నాటి నుండి నేటి వరకు ప్రజలను నిత్యం చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందన్నారు. నూరేండ్ల సుధీర్ఘ ప్రస్థానంలో సిపిఐ నిర్వహించిన పోరాటాలతో, ఉద్యమాలతో ప్రజలకు, కార్మిక వర్గాలకు అనేక హక్కులు సాధించి పెట్టామన్నారు. ఈ క్రమంలో ఎందరో అమరులు నేలకొరిగారని, మరెందరో ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేశారని వారి ఆశయాలను సాధించేందుకు పార్టీ

మిగతా 2లో..

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



-గూడూరుపాడు అభివృద్ధికి రూ. 8.50 కోట్లు మంజూరు
-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** అర్హులైన పేదలందరికీ మూడు విడతల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో గూడూరుపాడు గ్రామాభివృద్ధికి రూ.8.50 కోట్ల నిధులు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గూడూరుపాడు గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గూడూరుపాడు నుండి ఆకేరు వయా శ్మశానవాటిక వరకు రూ.1.10 కోట్లతో ఎంవి పాలెం, గూడూరుపాడు రోడ్డు నుండి గూడూరుపాడు చెరువు అలుగు వరకు

మిగతా 2లో..

# బిసి ద్రోహిగా మిగిలిపోవద్దు



-బిఆర్ఎస్ నుంచి నన్ను బయటకు పంపారు
-తుమ్మలను వదులుకోవడం తప్పిదం
-పార్టీ స్థాపన ఆలోచన ఇప్పట్లో లేదు
-రాజకీయాల్లో మాత్రం కొనసాగుతా
-మీడియా సమావేశంలో జాగృతి కవిత

**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీలో 42 శాతం రిజర్వేషన్లు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసి రిజర్వేషన్లకు తిలోదకాలు ఇచ్చి బిసి ద్రోహిగా మిగల రాదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. తమిళనాడులో తొమ్మిదేళ్ల పాటు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా కేంద్రంపై పోరాడి మాజీ ముఖ్యమంత్రి జయలలిత రిజర్వేషన్లను సాధించిందని ఆమె గుర్తు చేశారు. సోమ, మంగళవారాల్లో కవిత ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను సందర్శించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిసిలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఉత్తుత్తి ఆందోళనలు చేస్తుందని ఆమె తెలిపారు. కేంద్రంలో బిజెపి బిసిలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. బిసి రిజర్వేషన్లు సాధించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆమె తెలిపారు. రాష్ట్రంలో కానీ దేశంలో కానీ బలమైన ప్రతిపక్షం ఉండాలని కానీ దురదృష్టవశాత్తు ప్రతిపక్షం లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని కవిత తెలిపారు. బలమైన రాజకీయ నాయకునిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును బిఆర్ఎస్ వదులుకోవడం అతి పెద్ద తప్పిదమని తుమ్మల నాగేశ్వరరావు లాంటి వ్యక్తులు బయటకు వెళ్లిన తర్వాతే బిఆర్ఎస్ పని అయిపోయిందన్న భావన రాష్ట్రంలో బలపడి 2023లో ఓటమికి కారణమైందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి తాను బయటకు రాలేదని కొందరు కుట్ర చేసి బయటకు పంపించారని నన్ను కేవలం నిజామాబాద్‌కే పరిమితం చేయాలని చూశారని ఆమె ఆరోపించారు. ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లాకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని ముగ్గురు మధ్య సమన్వయ లోపం అధికారులకు

మిగతా 2లో..

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



(మొదటిపేజీ తరువాయి)

రూ.3.30 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గూడూరుపాడు నుండి గొర్లపాడు వరకు రూ.2.97 కోట్లతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గూడూరుపాడు గ్రామానికి అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం కోసం రూ. 35 లక్షలు, ఆరగ్య ఉపకేంద్ర భవనానికి రూ. 21 లక్షలు, త్రాగునీటి కోసం రూ. 7లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గూడూరుపాడు గ్రామానికి రూ.8.50 కోట్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు కోల్డ్ స్టోరేజీ రోడ్డు మార్గం మంజూరు చేయడం జరుగుతుందన్నారు.పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం సరఫరా, రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల నిరుపేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేసిందన్నారు. గూడూరుపాడు గ్రామంలో 17 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. రాబోయే మూడు విడతల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు తప్పనిసరిగా మంజూరు చేస్తామన్నారు. పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమంలో రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేస్తూ తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందించామన్నారు. పేదల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీవో జి. నర్సింహారావు, ఎంపిడివో, ఆర్అండ్బి ఎస్ఈ యాకోబు, ఆర్డబ్ల్యూఎస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సిపిఐ నాయకులు పుచ్చకాయల కమలాకర్, సిద్దినేని కర్ణకుమార్, పుచ్చకాయల సుధాకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలతో పురోగమనం



(మొదటిపేజీ తరువాయి)

శ్రేణులు అనునిత్యం శ్రమించాలని కోరారు. డిసెంబర్ 26వ, తేదీన ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో జరుగనున్న సిపిఐ శత వసంతాల ముగింపు వేడుకల భారీ బహిరంగ సభ నేపద్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యువతీ, యువకులచే, జనసేన శిక్షణా శిభిరాలను ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగా జిల్లాలో 10 శిభిరాలలో మూడు వేల మంది జనసైనికులను తయారు చేస్తున్నామని చెప్పారు. భారీ బహిరంగ సభలో సేవాదళ్ వలంటీర్లు కదంతొక్కనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్రావు,ఉపప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావు, సనప నాగేశ్వరరావు, వర్క అజిత్, నాయకులు నరహరి నాగేశ్వరరావు, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీనివాస్,మోహన్, ఎస్కే గౌస్ పాషా, సుజన్, శ్రీను, క్రిష్ణ, శంకర్, సంజీవరావు పాల్గొన్నారు.

# విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకునేందుకు 'ఎవ్రి చైల్డ్ రీడ్స్ యాప్'





**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా తొలిసారి ఖమ్మం జిల్లాలో విద్యార్థుల యొక్క విదాయ నైపుణ్యతను తెలుసుకునేందుకు సరికొత్త విధానానికి పునాది వేశారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివే పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ఈసియల్(ఎవ్రి చైల్డ్ రీడ్స్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు విద్యార్థుల రీడింగ్ విధానాన్ని తెలుసుకునేందుకు గాను ఒక ప్రత్యేక సాఫ్ట్వేర్తో యాప్ తయారు చేపించి ప్రతి పాఠశాలల్లోని విద్యార్థుల రీడింగ్ కార్యక్రమం ద్వారా ఇంగ్లీష్ నైపుణ్యాన్ని పెంచుకునే విధంగా కార్యక్రమాన్ని చేపట్టారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల రీడింగ్ ఏ విధంగా ఉంది. రోజురోజుకు ఏ విధంగా ఇంప్రూవ్ అవుతున్నారా లేదా అనేది తెలుసుకునేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో 14వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా తొలిసారి వైరా లోని గుట్టబడి యుపిఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ మంగళవారం జెడ్పి సీఈవో దీక్ష రైనాతో కలిసి ఆయన పరిశీలించి 3,4 తరగతి విద్యార్థులతో తరగతి గదిలో ఒక ఉపాధ్యాయుడిలా విద్యార్థులతో రీడింగ్ విధానం గురించి బ్లాక్ బోర్డుపై వ్రాసి విద్యార్థులను జిల్లా కలెక్టర్ అనుదీప్ ఒక ఉపాధ్యాయుడిలా చదివించారు. విద్యార్థుల రీడింగ్ విధానాన్ని ఇంప్రూవ్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి పిల్లవాడి మీద ఉపాధ్యాయుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో ఉండాలని , విద్యార్థికి రీడింగ్ అనేది చాలా ముఖ్యమని ఆయన వివరించారు. జిల్లావ్యాప్తంగా ఈసిఆర్ యాప్లోని విద్యార్థులు రీడింగ్లో ముందున్నారు. ఎంతమంది విద్యార్థులు వెనుకబడి ఉన్నారనేది క్షుణ్ణంగా కలెక్టర్ అనుదీప్ పర్యవేక్షణ చేపట్టారు. అనంతరం రెబ్బవరం గ్రామంలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ కష్టపడి చదవాలని సమయాన్ని వృధా చేయవద్దని పరీక్షలు సమీపిస్తున్న వేళ ప్రతి విద్యార్థి ప్రతి ఒక్క సబ్జెక్టుపై దృష్టి సారించి కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత చదువులకు వెళ్లాలని తెలిపారు. విద్యార్థులకు వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావద్దని, జిల్లా కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారితో మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థి యొక్క చదువు ఏ విధంగా ఉంది. ఇంటి వద్ద ఏ విధంగా చదవుతున్నాడు అనేది తెలుసుకోవాలి. అది ఉపాధ్యాయులు బాధయతని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఇంపూప్రవ్ కాకుండానే ఇంప్రూవ్ అయ్యారు అని రీడింగ్ యాప్లో తప్పుడు రిపోర్ట్ను నమోదు చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో సక్రియ, మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్, మున్సిపాల్ కమీషనర్ గురులింగం, మున్సిపాల్ శానిటేషన్ అధికారి, వీరన్న, ఉపాధ్యాయులు చారి, పెనుగొండ ఉపేందర్, వెంకట్రావు, లలిత, దొడ్డా వరప్రసాద్, ఏఈవో అవినాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి ద్రోహిగా మిగిలిపోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందిగా మారిందన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో కేంద్రంతో సంప్రదించి తేమ శాతం ఎక్కువగా ఉన్న కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజక వర్గంలో కేసిఆర్ హయాంలో మొదలు పెట్టిన 100 పడకల ఆసుపత్రిని భట్టి విక్రమార్క ముందుకు సాగనివ్వడం లేదని కవిత ఆరోపించారు. అంచనాలు పెరుగుతున్నాయి తప్ప సీతారామ ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తి కావడం లేదని ఆమె తెలిపారు. భవిష్యత్తులో ఎర్ర జెండాలతో కలిసి పోరాటం కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పాలనలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అవి మరింతగా ముందుకు సాగకపోవడమే ఓటమికి కారణమైందని కవిత తెలిపారు. రహదారుల పరిస్థితి జిల్లాలో సరిగ్గా లేదని గ్రానైట్ ఇండస్ట్రీ కూడా ఇబ్బందుల్లో ఉందని ఆమె తెలిపారు. తాను రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన ఇప్పట్లో లేదని ఫిబ్రవరి 17 వరకు జన జాగృతి కార్యక్రమాలు ఉన్నాయని ఆ తర్వాత ప్రజల్లో ఉండి ప్రజలను జాగృతం చేస్తానని ఆమె తెలిపారు. కానీ రాజకీయాల్లోనే కొనసాగుతానని ఆమె స్పష్టం చేశారు. బిఆర్ఎస్లో తాను ఎవరిని టార్గెట్ చేయలేదని కొందరు తనను టార్గెట్ చేస్తున్నారని ఆమె తెలిపారు. అందరికి అన్యాయం చేసేది బిజెపి అని కాంగ్రెస్, బిఆర్ఎస్లతో పాటు బిజెపిపైన ఓ కన్నెసి ఉంచాలన్నారు. నిరుద్యోగం, రహదారుల అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు తదితర విషయాలపై దృష్టిసారించాలన్నారు. త్వరలో సింగరేణి సమస్యల పరిష్కారానికి సింగరేణి భవన్ను ముట్టడిస్తామని ఆమె తెలిపారు. సామినేని రామారావు హత్య కేసు నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ డిజిపిని కలవనున్నట్లు ఆమె తెలిపారు.

# విద్యార్థులకు అండగా 'జోస్ అలుక్కాస్'

## రూ.172640లు విరాళం



**ప్రజాపక్షం/వైరా:** మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డులో ఉన్న ప్రాధమిక పాఠశాల వైరా విద్యార్థిని, విద్యార్థులు క్రింద కూర్చొంటున్నారని తెలుసుకున్న ఖమ్మంలోని జోస్ అలుక్కాస్ బంగారు షాపు యాజమాన్యం గొప్ప మనసు చాటుకుంది. రూ.172640లు విలువైన బల్లలను, మైక్ సెట్ను అందించారు. ఈ కార్యక్రమంలో జోస్ అలుక్కాస్ ఖమ్మం బ్రాంచి మేనేజర్ సిరిల్, వారి బృందం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగబత్తిని స్వప్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. జోస్ అలుక్కాస్ వారి ధాతృత్వానికి గాను పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, ఆ సంస్థ యాజమాన్యాన్ని ఘనంగా సన్మానించారు.

# ఘనంగా నాయీ బ్రాహ్మణ వన సమారాధన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ వైరా మండల నాయిబ్రాహ్మణ కుటుంబ సభ్యుల వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వనసమారాధన కార్యక్రమం వైరా రిజర్వాయర్ అలుగు ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళా క్రీడా పోటీలు నిర్వహించారు. నాయిబ్రాహ్మణ కుల పెద్దలను, మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సమైక్య సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జలి వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొల్లి శ్రీనివాస్, ఆ సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారులు కుదురుపాక శ్రీహరితో పాటు వైరా మండల అధ్యక్ష, కార్యదర్శులు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదాల హరినాధ్, తూముల నాగభూషణం, ఆలేటి సతయనరాయణ, ఆలేటి వెంకటప్పయ్య, లింగంపల్లి అప్పారావు, ఉప్పే వెంకటేష్, కుదురుపాక సుధాకర్, కేతవరపు నారాయణరావు, పెడకంటి ఉదయ్కుమార్, చిన్నముత్తేవి ప్రసాద్, చిన్న ముత్తేవి మురళి, శ్రీకాకుళం శ్రీరంగ, శ్రీకాకుళం శ్రీను, నంద్యాల శ్రీను, కేతవరపు నాగరాజు, అంజి, పాలపాటి వేణు, శ్రీకాకుళం రాము, రాచమల్ల వెంకటేశ్వర్లు, నంద్యాల బ్రహ్మం, కుదురుపాక భాస్కర్, రంగా, రాము తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి




**ప్రజాపక్షం/ బోనకల్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యా విధానం రద్దు చేయాలని టిఎస్యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్.రంజాన్అలీ డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం రద్దు అయ్యే వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావినూతల గ్రామంలో టిఎస్ యుటిఎఫ్ 12వ మండల మహాసభ ఆ సంఘం మండల అధ్యక్షులు గార్లపాటి చిన్న రంగారావు అధ్యక్షతన జరిగింది. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా జానకిపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం గొండెల శ్రీనివాస్కుమార్ టిఎస్ యుటిఎఫ్ పథకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, పూర్వ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, పూర్వ మండల సీనియర్ నాయకులు నీలం లక్ష్మి నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ,జి.శ్రీనివాస్కుమార్, సీనియర్ జిల్లా నాయకులు సద్దాబాబు తదితరులు పాల్గొన్నారు.

# పత్తికి మద్దతు ధర కల్పించాలి

## -బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఆందోళన



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పత్తికి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ పిలుపులో భాగంగా ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ లు పాల్గొన్నారు. మార్కెట్‌లో రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల షరతులతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలు, పెరిగిన పెట్టుబడులతో రైతులు సరిగ్గా దిగుబడి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండిన కొద్ది పాటి పంటకు కూడా సరైన మద్దతు ధర లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. సిసిఐ నిబంధనలతో రైతులు పత్తి అమ్ముకునేందుకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని అమ్ముకునేందుకు రైతులకు ప్రభుత్వం అవగాహన కల్పించలేదన్నారు. గ్రామాల్లో దళారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లోనైనా మద్దతు ధర వస్తుందని ఆశతో మార్కెట్‌కు వస్తే క్వింటా ఆరువేలకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి పత్తి రైతుకు మద్దతు ధర కల్పించాలని లేని పక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, ఖమర్, వీరునాయక్, బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, బి. వీరన్న, ముత్యాల వెంకటప్పారావు, తాజుద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. మంగళవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఖమ్మం నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్ రాజు, సెక్రటరీ ఇమామ్, ఉద్యోగులు భాస్కర్, సిహెచ్ శ్రీనివాస్, ఎస్. లలిత కుమారి, అఖిల్, సుమలత, విజయకుమారి, నాగలక్ష్మి, రవిబాబు, భూక్యాబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో నషాముక్త భారత్ అభియాన్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లు పంచాయతీ పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటువంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమన్ డెవలప్‌మెంట్ అధికారి సులోచన, డాక్టర్ లక్ష్మి నారాయణ, కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇన్‌చార్జ్ కృష్ణప్రసాద్,వివిధ విభాగాలధిపతులుడాక్టర్ ప్రణతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ చార్యులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన తేనెను ప్రజలకందిస్తాం

## రాష్ట్ర జైళ్లశాఖ డిజిపి డాక్టర్ సౌమ్య మిశ్రా



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రజలకు స్వచ్ఛమైన తేనెను అందించేందుకే సబ్‌జైల్ ప్రాంగణంలో స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని రామన్నపేటలో గల సబ్‌జైల్ వద్ద నూతన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రజలకు స్వచ్ఛమైన తేనె అందడంతో పాటు ముద్దాయిలకు ఉపాధి దొరుకుతుందన్నారు. జైల్ నుంచి విడుదలైన తర్వాత ఇక్కడ నేర్చుకున్న వ్యాపారం బైట పెట్టుకుని లాభాలు గడించాలని సూచించారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న ఆహారం, వసతులను గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్(వెల్ఫేర్) మురళీబాబు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జెనరల్ ఆఫ్ ప్రిజన్స్ హైదరాబాద్ రేంజ్ ఎం సంపత్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఖాలీద్, ఖమ్మం జిల్లా జైల్లు పర్యవేక్షణఅధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట నిఘా ఉండాలి

## -ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగొద్దు
## -చెక్‌పోస్ట్, కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన పౌర సరఫరాల అధికారి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద నిఘా పటిష్టంగా చేపట్టాలని ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాల్లోకి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ ముదిగొండ మండలం వల్లభి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి సన్న ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ధాన్యం రవాణాకు సంబంధించి పత్రాలు తనిఖీ చేయాలని అక్రమ రవాణా అయితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయాలన్నారు. చెక్‌పోస్ట్ నిర్వహణ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. వల్లభి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ఇంత వరకు ఎంత మేర ధాన్యం కొనుగోలు చేసింది, మిల్లులకు ఎంత మేర రవాణా చేసిందని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. కొన్న ధాన్యాన్ని వెంట వెంటనే సంబంధిత మిల్లులకు రవాణా చేయాలన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు అందేలా సంబంధిత నమోదులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల డిటి విజయ్‌బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బూట్లు పంపిణీ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం ఆరెకోడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బూట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిలివేరు బాబు, గునిగంటి సురేష్, మారెమ్మగూడి డైరెక్టర్ కుసుమ రాజారాములు, మార్కెట్ డైరెక్టర్ ఉప్పగండ్ల ప్రసాద్, గునిగంటి గాంధీ, రమేష్, సీతయ్య, కృష్ణ, శ్రీను, దాసు, నవీన్, ఆరెంపుల శ్రీను, వీరభద్రం, సునీత, నాగమణి, శ్రీలత, గ్రామ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

# మాదిగ వనసమారాధన కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం రెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాదిగల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గ స్థాయి మాదిగ వనసమారాధన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసెంబర్ మొదటివారంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన కార్యచరణపై చర్చించుకున్నారు. మాదిగ కుటుంబ సభ్యులు కుటుంబాలతో సహా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి భాస్కర్, కందుకూరి వెంకటనారాయణ, అశోక్, దాసు, రవి, శేఖర్, గర్జన్, అనిల్, రాంబాబు, వెంకటేశ్వర్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో కొందరు రాజకీయ నాయకులు అధికార పార్టీ అండదండలతో అరాచకాలు సృష్టిస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల మన్ననలు పొంది ప్రజల శ్రేయస్సు కోరాలి గాని అనవసరంగా ప్రత్యర్థుల ఆస్తులపై, వ్యక్తిగత దాడులు చేస్తే కాలగమనంలో కలిసిపోతారని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు నిమ్మల నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూపెడ గ్రామానికి చెందిన బొల్లికొండ రామచంద్రయ్య బొల్లికొండ వెంకటేశ్వర్లు అను ఇద్దరు అధికార పార్టీ నాయకుల అండదండలతో సామాన్య ప్రజలను గ్రామంలో ఇబ్బందులు గురి చేస్తూ వ్యక్తిగత దాడులకు పాల్పడుతూ తమ ప్రత్యర్థుల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బచ్చోడు జూపెడ మధ్య ప్రధాన రోడ్డు పక్కన సర్వే నెంబర్ 145 నెంబర్లో గల వ్యవసాయ భూమిని మొక్కల పెంపకం కోసం లీజు ఇచ్చారు. ఈ క్రమంలో జూపెడ గ్రామానికి చెందిన రామనర్సయ్య వెంకటేశ్వర్లు ఇద్దరు అధికార పార్టీ అండదండలతో సుమారు 8 ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసి నరసింహారెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ధ్వంసం చేసిన దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# చెరుకూరి నాగార్జునపై కేసు నమోదు

ప్రజాపక్షం/ మధిర : మధిర నియోజకవర్గ కేంద్రంలో సంచలనం కలిగించి భూ వివాదంపై ఎట్టకేలకు మధిర టౌన్ పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. మధిర మున్సిపాలిటీకి చెందిన రిటైర్డ్ ఎంఇఓ అనుమోలు భాస్కర్‌రావు మధిర విజయవాడ రోడ్డులోని 221 సర్వే నెంబర్‌లో 254.8 చదరపు గజాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, నా స్థలం వద్దకు నేను సెప్టెంబర్ 10వ తేదీన వెళ్లి అక్కడ నా స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలు పీకిస్తుంటే అక్కడికి పట్టణానికి చెందిన చెరుకూరి నాగార్జున అనే వ్యక్తి వచ్చి నా స్థలంలో నువ్వెవరివి మొక్కలు పీకటానికి అని నన్ను బెదిరించి ఇది నా స్థలం దీంట్లోకి వస్తే నీ సంగతి చూస్తా నీ అంతు తేలుస్తా నీ దిక్కున్న కాడ చెప్పుకో అని నన్ను బెదిరించడాని రిటైర్డ్ ఎంఇఓ అనుమోలు భాస్కర్‌రావు మధిర పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమోలు భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు టౌన్ సిఐ రమేష్ విచారణ చేపట్టి అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయటం జరిగినట్లు అనుమోలు భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ కూడా పోలీసులు తనకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానం



ప్రజాపక్షం/ మధిర : మధిరలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలదారులకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకులు మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు, సవిత దంపతులు, టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి దీక్షాపరులకు దాతల సహకారంతో 41రోజులు పాటు అన్నదానాన్ని ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి దేవాలయ నిర్వాహకులను ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్వామి వారి దీవెనలు మధిర ప్రజలపై ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మాదక ద్రవ్యాల వ్యసన నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని మహిళా డిగ్రీ కళాశాల నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వ్యసన నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పోరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనాల వల్ల జీవితాలు ఛిద్రం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటరి సూపర్‌వైజర్లు, ఎస్ఐలు, జవాన్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలి



ప్రజాపక్షం/ మధిర : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయదాసు అన్నారు. మంగళవారం కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. డ్రగ్స్ ,గంజాయిని నిర్మూలించేందుకు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి యువత భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు, ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా, తరలించినా సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ వనజీవి చిత్రపటానికి కవిత నివాళి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య ఇంటి వద్దకు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వనజీవి భార్యను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల భరతం పడదాం

**-యువత చెడు మార్గం వైపు చూడొద్దు : ఎక్సైజ్ సీఐ సుంకరి రమేష్**




ప్రజాపక్షం/నేలకొండపల్లి : మాదక ద్రవ్యాల భరతం పట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ సుంకరి రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం మాదక ద్రవ్యాల నిరోద అవగాహన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వలన యువత జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. సమాజంలో డ్రగ్స్ ప్రభావం అధికమైందని అన్నారు. డ్రగ్స్ నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే నిషాముక్త భారత్ అభియాన్ చేపట్టినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన ఆరోగ్యం పాడై ఆర్థికంగా, విద్యాపరంగా నష్టపోతున్నారని అన్నారు. సమాజంలో హీన స్థితికి చేరుకుంటున్నారని అన్నారు. క్యాన్సర్కంటే ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎక్కడైనా డగ్స్ కు సంబంధించిన సమాచారం ఉంటే శాఖ 18001252523 టోల్ ఫ్రీ కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కోన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించారు.

## వంద పడకల ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత లోపం..!

**-నాసిరకం బ్రిక్స్‌తో గోడల నిర్మాణం**
**-వర్క్ ఆర్డర్ నిబంధనలు అమలు ఎక్కడ?**
**-అధికారుల పర్యవేక్షణ కరువు**







ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల పాఠశాల సమీపంలో జరుగుతున్న 100 పడకల ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనుల్లో అడుగడుగున నాణ్యత లోపమే జరుగుతుందని చెప్పవచ్చును. నిర్మాణ పనులు పర్యవేక్షణపై అధికారులు పట్టింపు లేకుండా నామమాత్రంగానే ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పుడో వచ్చామా వెళ్లిపోయామా అనే ధోరణిలో అధికారుల పనితీరు కనిపిస్తూ ఉంది. పూర్తిగా ఆ హాస్పిటల్ నిర్మాణ నాణ్యత లోపంతో జరుగుతుంది. హాస్పిటల్ భావన నిర్మాణానికి వాడాల్సిన వర్క్ ఆర్డర్ నిబంధనలు సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు అనే వాదన కూడా లేకపోలేదు. అసలు 100 పడకల ఏరియా హాస్పిటల్ నిర్మాణానికి వర్క్ ఆర్డర్‌లో ఇచ్చిన నిబంధనలు ఏమిటి ఇచ్చిన వర్క్ ఆర్డర్ ప్రకారమే నిర్మాణ పనులు జరుగుతున్నాయో లేదా కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా పనులు జరుగుతున్నాయా అనేది కూడా ఆలోచించాల్సిన అవసరం. 100 పడకల ఏరియా హాస్పిటల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.37.50కోట్లను తెలంగాణ వైద్య విధాన పరిషత నిధుల నుండి కేటాయించడం జరిగింది. అయితే ఈ భవన నిర్మాణ పనులకు పూర్తిగా నాసిరకం సిమెంట్ బిళ్ళను ఉపయోగిస్తున్నారు. ఇలాంటి పెద్ద భవనానికి నాసిరకం సిమెంటు బిళ్లలు వాడుతున్నారా అని సూచన వాళ్లే ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. పర్యవేక్షించాల్సిన అధికారులు కనీసం నాసిరకం సిమెంటు బిళ్ళలు తీసుకొచ్చిన కూడా వాటి వైపు చూడడం లేదు. అంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో ఒకసారి అర్థం చేసుకోవాలి. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన హాస్పిటల్ భవన నిర్మాణం ఎంత నాణ్యతతో ఉండాలి. భవన నిర్మాణంలో నాణ్యత లోపం ఉంటే ఆ భవనం ఎక్కువ రోజులు ఉండదు. ఇది అధికారులకు తెలియదా కాని తెలిసినా కూడా మౌనంగా ఉంటున్నారా? ఎందుకు నాసిరకంగా నిర్మాణ పనులు కొనసాగుతుంటే అధికారులు పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. హాస్పిటల్‌కి వచ్చే ప్రజలు సురక్షితంగా తిరిగి వెళ్లాలి అంటే భవన నిర్మాణాలు స్టాండర్డ్‌గా ఉండాలి. అలాంటి భవన నిర్మాణాలు నాణ్యతతో నిర్మించాలి కాని నాణ్యత లోపం చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయకూడదరు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు వైరాలో జరుగుతున్న వంద పడకల ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## 15వేల మందితో ఎర్రదండు కవాతును జయప్రదం చేద్దాం

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లన్న**



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ జనసేవ దళ్ శిక్షణ శిబిరం ఆళ్లపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లన్న పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందల సంబరాల సభ ఖమ్మం నడిబొడ్డున నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి 10లక్షల మంది దేశం మన మూలన నుండి కార్యకర్తల హాజరవుతారని, 40దేశాల నుండి ప్రతినిధులు వస్తారని ఈసందర్భంగా 15వేల మంది జనసేన కార్యకర్తలతో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఈ దేశంలో సోషలిజ స్థాపన కోసం ఎర్ర దళం కవాత్ నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమంలో యువత చైతన్యవంతంగా పాల్గొని, ఎంతో మంది అమరవీరుల సాక్షిగా ఏరుపెక్కిన ఆ ఎర్రజెండా ఆ అమరవీరులను స్పృశించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఈకార్యక్రమంలో జనసేన రాష్ట్ర ఇన్స్పెక్టర్ మద్దోజు శ్రవణ్ కుమార్ పాల్గొని విజయవంతంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించగా జిల్లా సమితి సభ్యులు గొగ్గల కృష్ణ, మండల సహాయ కార్యదర్శులు నరెడ్ల రాంబాబు, వజ్జ పగడయ్య, ఎస్కె రహీం, మండల నాయకులు దీకొండ మల్లేష్, గుంతోజు శివ, మద్దెల వెంకటేశ్వర్లు, నరెడ్ల శివ, కందిమల్ల రాజు, కుంట సహదేవ్, గొగ్గల లక్ష్మి, తాళ్లపల్లి వినయ్, ముజీబ్, పూణెం లక్ష్మి నారాయణ, వజ్జ శేఖర్, తాళ్లపల్లి సాయన్న, శ్రీను, వజ్జ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న శీతల గాలుల తీవ్రత..!



ప్రజాపక్షం/ఖమ్మం : శీతల గాలుల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రధానంగా శివారు ప్రాంతాలలో ఉన్న కరకగూడెం మండలం ప్రజలు రోడ్లపైకి వెళ్ళాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పొగమంచు, చలి తీవ్రత నేపథ్యంలో వాకింగ్ లు కూడా వాయిదా వేసుకునే పరిస్థితులు. తెల్ల వారు ఝూమున వాకింగ్ ప్రారంభించే వాళ్ళు ఆలస్యంగా వెళ్తున్నారు. చలి తీవ్రత నేపథ్యంలో చిన్న పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా శివారు ప్రాంతాలలో చలి పెరగడంతో పాటు పొగమంచు కమ్ముకుంటుంది. తెల్లవారుఝాము నుండే ఉదయం గం. 8.00ల వరకు పొగమంచుతో రోడ్లు కనిపించడం లేదు. ఇది చూడటానికి ఆహ్లాదకరంగా కనిపిస్తున్నా ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుంది. చలి కార ణంగా జలుబు, జ్వరాలు వస్తు న్నాయి. పొగమంచు కార ణంగా అవుటర్ రింగై పై ప్రయాణం నరకప్రాయంగా మారింది. తెల్ల వారుఝా మున అవుటర్స్ పై ప్రయాణం చేయాలంటే పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అవుటర్స్ పై మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తెల్లవారురుఝామున వివిధ ప్రాంతాలనుంచి వచ్చే వాహనాలు ఎక్కువగా ఉంటాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్ళాల్సి వస్తే మాత్రం స్వెట్టర్లు, చేతులకు గౌజులు, చెవులు, ముక్కు, తల పూర్తిగా కప్పుకోవాలి. మంచు కురిసే వేళలో తలకు మంకీ క్యాపులు పెట్టుకోకపోతే మాత్రం జలుబు చేసే అవకాశం ఉంది. తీవ్ర చలి కారణంగా ఉదయం చాలామంది వాకింగ్‌లకు దూరమయ్యారు. సంక్రాంతి పండుగ తరువాత చలి తీవ్రత తగ్గే అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే కనిష్ఠ ఉష్ణోగ్రతలు గడిచిన 24 గంటల్లో హైదరాబాద్లో పగటి ఉష్ణోగ్రత 28 డిగ్రీలు నమోద కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీలుగా నమోదైంది. దుండిగ ల్లో 27.7 గరిష్ఠ 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు, హకీంపపేటలో 26.9 గరిష్ఠ, 13.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పరిశీలిస్తే ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లా మిగతా ప్రాంతాల్లో కంటే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 28 డిగ్రీలగరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కనిష్ఠంగా 7.2 ఆ తరువాత రామగుండంలో కనిష్ఠంగా 9.6 డిగ్రీలు, మెదక్ లో 28.6 గరిష్ట, కనిష్ఠంగా 11 డిగ్రీలు, హన్మకొండలో గరిష్ఠంగా 28.8 డిగ్రీలు, కనిష్ఠంగా 12 డిగ్రీలు, ఖమ్మంలో 31.2 గరిష్ఠ, 12.6 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత కనిష్ఠానికి పడి పోనున్నాయని వాతావరణశాఖ చెబుతోంది. అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు చెబుతున్నారు. కరకగూడెం మండల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని డాక్టర్లు రవితేజ సూచిస్తు న్నారు.

# దూది దుఃఖిస్తోంది..!

**నేతలారా ఆలోచించండి**







ప్రజాపక్షం/నేలకొండపల్లి : నేను పత్తి పంటను...తెల్ల బంగారమని, ఖండాంతర ఖ్యాతి గడిచిందని...మీరు వేదికల పై సమీక్ష సమావేశాలలో అభివర్ణించినప్పుడల్లా నా గుండె ఉప్పొంగుతుంది. కానీ మార్కెట్ కు రాగానే తేమ శాతం, పింజ పొడవు, నాణ్యత ప్రమాణాలంటూ కొర్రిలు పెడుతూ...నేను పనికి రానన్నట్లు గా చెబుతుంటే మనస్సులో బాకు దించినట్లు అవుతుంది. నేనేంటో ...? రైతు నా కోసం పడే కష్టమేంటో...? ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడే తీరేంటో ..?

### మీకు తెలిసిందే...ప్రస్తుతం నా ఆవేదన వినరూ..

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో పత్తి పంట పరిస్థితి దారుణంగాఉంది. ఆరుగాలం పండించిన పంట వివిధ కారణాల వలన తుపాన్ కు దెబ్బతిని పెట్టుబడులు పెరిగి...దిగుబడలు తగ్గి నిండా మునిగిన పత్తి రైతు కు అనేక కొర్రిలు పెడుతున్నారు. తాజాగా ఏకంగా సీసీఐ కేంద్రాలను మూసేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులారా...అధికార యంత్రాంగం...ప్రతీ ఒక్కరు నిత్యం వినియోగించే దుస్తులలో దారమై ఉంది నేనే...ఈ ఏడాది జిల్లాలో లక్షల ఎకరాలలో పత్తి సాగు చేశారు. ఎకరాకు 5 నుంచి 8 క్వింటాల మాత్రమే దిగుబడి వస్తుంది. నేను కాయరూపు లో దాల్చక ముందే వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు.ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాల వలన నన్ను నిలువునా ముంచాయి. నా పై ఆదారపడిన రైతుల వేదన చూస్తుంటే తెలుపు రంగులో ఉండే నా రూపు నలువుగా మారుతోంది. మీరేమో నా గోడు పట్టించుకోవటం లేదు..నాయ్యమైనా...?

### మీ లక్ష్మి ని నేనే...

నేను మీ ఇంటి లక్ష్మి ని ...మీ ఆకలి తీర్చే కల్పవల్లిని ...మీ కుటుంబాల స్థాయి కి అనుగుణంగా ప్రకృతి ధర్మంగా కలిసి వస్తున్నా..పంటను. ఏ విధంగా చూసినా .. మీ బతుకుదెరువుల వారధిని లేని పోనీ నిబంధనలతో నా తోడునీడలైన రైతులను అన్యాయం చేయవద్ధని వేడుకుంటున్నా.

### తేమ నా తప్పా....

డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత భారీగా నమోదుతుంది. తేమ మాత్రం 812 శాతం అంటారు. ఎలా సాధ్యం. ప్రమాణికత ఎంటనీ ఎప్పుడైనా ఆలోచించారా....సీసీఐ పెట్టే కొర్రీలు వ్యాపారులకు కలిసి వస్తున్నాయి. ఎంతో చరిత్ర కలిగిన జిల్లా రైతులను...నన్ను తేమ శాతం పేరుతో వేధిస్తున్నారు. ఇది న్యాయమా...వ్యాపారులు ఏ రోజైనా తేమ శాతం చూసి కొనుగోలు చేశారా లేదు..కానీ రైతుల వద్ధ మాత్రమే ఎందుకు అన్ని ప్రశ్నిస్తున్నా...ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడులు పెడితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.8,110 తేమ పేరిట కోతపడగా సగటున వచ్చేది రూ..7 వేలు కూడ రాని పరిస్థితి...ఇక చెప్పండి...నన్ను ఆదరిస్తున్నారా...? అయితే పాలకులు..నేతలు...అధికారులు వెంటనే సీసీఐ కేంద్రాలను ప్రారంభించి....నిబంధనలను సడలించి నన్ను గా కొనుగోలు చేయాలని ఆశిస్తున్నా....మీ...తెల్లబంగారం.

### ఎకరానికి ఆరు క్వింటాలు : వి.వెంకటేశ్వర్లు, పత్తి, రైతు ముజ్జుగూడెం



ఎకరానికి ఆరు క్వింటాల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. ఇలా అయితే పత్తి ఎలా సాగు చేయాలి. పెట్టుడులు పెరిగాయి... దిగుబడులు తగ్గాయి. అందు కే పత్తి పంట తీసేసి మొక్కజొన్న సాగు చేస్తున్నా.... పత్తి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

### సీసీఐ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి : యడ్ల తిరపతిరావు, రైతు సంఘం నేత, నేలకొండపల్లి.



సీసీఐ కేంద్రాలను మూసివేయటం వలన పత్తి రైతులకు తీరని నష్టం జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి సీసీఐ అధికారులతో చర్చించి వెంటనే ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

### ఇళ్ల వద్ధ నిల్వలు చేస్తున్నాం : నాగరాజు, రైతు, నేలకొండపల్లి.



పత్తి పంట సాగు చాలా కష్టాల సాగు గా మారింది. కానీ మొత్తం మీద పంట చేతికి వచ్చే సరికి సీసీఐ కేంద్రాలు లేకుండా పోయింది. దీంతో రైతులు పత్తి ని ఇళ్లలోనే నిల్వలు చేసుకుంటున్నారు. రైతుల గోడు ను అర్ధం చేసుకోవాలి.

## రెచ్చిపోతున్న ఇసుక మాఫియా..!

**- అధికార పార్టీ అండదండలతో ఇసుక దందా**
**- ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణా**
**- అక్రమ ఇసుక రవాణాపై అధికారుల మౌనమేల..?**





ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధిలోని కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలు చూసుకుని ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. రాత్రి పగలు తేడా లేకుండా ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. తిరుమలాయపాలెం మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇసుక రవాణా నిషేదం విధించిన సంగతి తెలిసిందే. అయినా కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కొందరు కాంగ్రెస్ నాయకులే ఇసుక వ్యాపారులుగా మారి గత ప్రజాప్రతినిధులు అని చెప్పి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఇసుక దందాలో పోలీసులు సైతం మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉంది. కాకరవాయి, ముజాహిత్‌పురం, పాలేరు వాగు నుండి వందల ట్రిప్పుల అక్రమ రవాణా చేస్తున్నారు. పోలీసులకు నేరుగా పత్రిక విలేకరులే ఫోన్ ద్వారా సమాచారం అందించిన వారు ఆలస్యంగా స్పందించారు. అప్పటికే ఇసుక దందా వ్యాపారులకు పోలీసులు వస్తున్నారని సమాచారం అందడంతో పరారయ్యారు. గుట్టుగా ఉండాల్సిన సమాచారం ఇసుక వ్యాపారులకు అందడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లను మైనర్ బాలురలకు డ్రైవింగ్ ఇవ్వడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ ఇసుక ముఠాకు ముజాయితీపురం గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త ప్రాతినిత్యం వహిస్తున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులను సైతం అనుమానించాల్సిన అవసరం తప్పనిసరి అయింది. కొందరు పోలీస్‌శాఖలో పనిచేస్తున్న వారు ఇసుక వ్యాపారులతో జత కలిసి వారికి ముందుగానే సమాచారం అందిస్తున్నట్లు మండల పరిధిలోని కొందరు పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించాలని, అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఇండియా లిట్రసి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో డిఈవో ఆదేశాల మేరకు 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ పై కెరియర్ గైడ్ ఎండి అవగాహన నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూరిభా విద్యాలయం నందు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పదవ తరగతి పూర్తి అయిన తరువాత ఉన్నత చదువులు ఉంటాయని, ఏ విధమైన కోర్సు తీసుకుంటే ఎక్కువ డిమాండ్ ఉంటుందనే విషయాలను తెలిపారు. కెరీరును ఎంచుకోవడంలో ఎటువంటి విషయాలను పాటించాలి, అనేటువంటి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థి విద్యార్థులు తమ యొక్క ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంతో కస్తూరిభా విద్యాలయం ఎస్వో సుశీల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కారేపల్లి: సాయిబాబా మాలదారులకు 2500 రూపాయలు అన్నదాన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ జిల్లా నాయకులు ఎస్కే గౌసుద్దీన్ సహాయం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిబాబా మాలదారులకు అన్నదాన కార్యక్రమానికి నా వంతు సహాయం అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఖలీల్ ఖాన్, నవీన్, ఉపేందర్, గోవింద్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: రైతులకు అందు బాటులో ఉండే విధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వరికి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు అదనంగా ప్రతి క్వింటాకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని ఎంపీఓ రవీంద్రప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తండారి చంద్ర ప్రకాష్ అన్నారు. మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఐకెపి గ్రూప్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, సొసైటీల ద్వారా సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపిఎం పెదమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు నాగేంద్ర, వీరస్వామి, పంచాయితీ కార్యదర్శి వాసం విజయ్ కుమార్, ఏఈఓ చంద్రకళ, డ్వాక్రా సభ్యులు టి స్వరూప, భారతి, ఏ శారద, కుర్ర శ్రీనివాసరావు, మాదారం మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ నాయక్, ధారావత్ వినోద్ నాయక్, పాపిని సత్యనారాయణ, మంకెన్ని చిన్న సైదులు, భాగం వెంకట అప్పారావు, గుర్రం హనుమంతరావు, పాపినేని నాగేశ్వరరావు, తుమ్మోజు రామ్మూర్తి, వడ్డె పుల్లయ్య, గుర్రం నరసయ్య, కాసాని లక్ష్మి నారాయణ, బట్టు నరసయ్య, డి కోటి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఉమ్మడి గుండాల మండలం పిఎసిఎస్ ఆధ్వర్యంలో రాళ్లపల్లి మండల కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, కోఆపరేట్ ఛైర్మన్ గుగ్గల రామయ్య, ఆర్ఐ రామయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎకరానికి 24 క్వింటాల చొప్పున కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని, మొక్కజొన్న తేమ 14శాతం తప్పకుండా ఉండాలని చెల్లించడం జరుగుతుందన్నారు. రెండు వారాలలోపు నీరుగా రైతుల ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఈవో రాంబాబు, ఇన్చార్జి సీఈవో సయ్యద్ బాషా, కాంగ్రెస్ కోప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, తాళ్లపల్లి వెంకన్న, కోఆపరేటివ్ డైరెక్టర్ సయ్యద్ ఆఫీస్, సుధాకర్, ఆదం, తదితరులు పాల్గొన్నారు.

# ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరే..

**- ఈ ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరపాలి**
**- ఎంఎల్‌ఏ కూనంనేని**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మావోయిస్టు కేంద్రమిటీ సభ్యుడు మాడవి హిడ్మాతో పాటు మరో ఐదుగురిది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ కౌంటర్ల పేరుతో నరహత్యలకు పాల్పడుతోందని ఆవేదనవ్యక్తం చేశారు. అసలు ఎన్‌కౌంటర్ అంటే ఇరు పక్షాలు ఎదురెదురుగా కాల్చుకునేది అని,కానీ ప్రస్తుతం హిడ్మా ఎన్‌కౌంటర్ చూస్తుంటే వారిని పట్టుకుని తెచ్చి కాల్చి చంపినట్లుగా స్పష్టంగా ఉందని, దానికి కట్టుకథ అల్లి ఎన్‌కౌంటర్ అనే అందమైన పేరు పెడుతున్నారని మండిపడ్డారు. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ పంతం పట్టి మరీ కాల్చి చంపుతున్నారని, 2026 మార్చి నెలాఖరు నాటికి మావోయిజాన్ని లేకుండా చేస్తామని చెప్పిన మోడిషాలు వారు చెప్పిన మాటకు సార్థకత చేకూరేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌తో పాటు ఇప్పటి వరకు చోటు చేసుకున్న పలు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించి న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించడం సరైంది కాదని, ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే మంచిదే అని, ఏకపక్షంగా వ్యవహరిస్తూ కనీస అవకాశం ఇవ్వకుండా చేయడం మంచిపద్ధతి కాదన్నారు. దేశంలో బిజేపి అరాచక పాలన సాగిస్తోంది, గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మొట్టికాయ వేశారని, బిహార్ ఎన్నికల్లో ఓట్ల గల్లంతుకు పాల్పడటంతో పాటు అయినవారి ఓట్లను కలుపుకుని విజయ సాధించినట్లు స్పష్టమైందని, ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని, ఇది జంగిల్ రాజ్ పరిపాలనలా ఉందని యద్దేవా చేశారు. ఓటు ఆడిటింగ్ ద్వారా దొంగ ఓట్లనుగుర్తించే అవకాసం ఉంటుందని, దేశంలో అలాంటి పద్ధతి ప్రవేశపెట్టాలన్నారు. ఇప్పటికైనా బూటకపు ఎన్‌కౌంటర్లు, మత గర్షణలకు, మతాలు, కులాల పేరుతో విభజనలకు స్వస్తి పలికి దేశంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సలిగంటి శ్రీనివాస్, జి వీరస్వామి, చంద్ర నరేంద్ర, వంట్టికొండ మల్లికార్జునరావు, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, వంగా వెంకట్, రత్నకుమారి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో రోజువారీగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం 5గంటకు మున్సిపాల్ కమీషనర్ గురులింగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కడ పారిశుద్ధ్య పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు అనేది తెలుసుకునేందుకు శానిటేషన్ అధికారి వీరన్నతో కలిసి మున్సిపాలిటీలో పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపాల్ కమీషనర్ గురులింగం శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. చేసే ప్రతి పని శుభ్రతగా ఉండాలని ఎక్కడ అపరిశుభ్రంగా కనిపించకూడదని ఆదేశించారు. నిత్యం మీకు శానిటేషన్ అధికారి వీరన్న అందుబాటులో ఉంటున్నాడు. పారిశుద్ధ్యం పనులు చాలా వరకు పూర్తి చేస్తున్నారు. వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుగా కనిపిస్తుందని మరింత మెరుగైన పనులు అందించేందుకు నిరంతరం మీకు అందుబాటులో ఉంటామని పారిశుద్ధ్యం గురించి సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలోకి వెళ్లి పని పూర్తి చేయాలని ఆదేశించారు.

# పిహెచ్‌సి, ల్యాబ్‌లను ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారిణి అరుణాదేవిని ఓపి వివరాలు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలను, వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని రక్త పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తప్పనిసరిగా రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు వైద్య, ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు పొందాలని సూచించారు.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-డిఆర్‌వో, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గీత పనివారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు తెలిపారు. గీత పనివారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్‌వోకు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గీతవృత్తి రక్షణ, వృత్తి దారుల సంక్షేమం, ఆధునికరణ వన పెంపకానికి 10 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. గీత వృత్తి దారులకు రక్షణ పరికరాలు పంపిణీ చేయాలని, రాష్ట్రంలోని గీత సహకార సంఘాలన్నింటికీ ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చేబ్రోలు ఇంద్రసేన, పరికపల్లి శ్రీను, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాలి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలో గత కొన్నేళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమని, బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోకినెపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా అర్ధరాత్రి జెసిబిలతో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కలిసి పేదలు నివసిస్తున్న ఇళ్లను ధ్వంసం చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇంతకాలం రెవెన్యూ యంత్రాంగం ఏమి మాట్లాడకుండా ఉండి ఆకస్మాత్తుగా ఫోర్స్ ఉపయోగించి పేదల నివాసాల మీద దాడి చేసి ఇళ్లను ధ్వంసం చేయటం హేయమైన చర్య అని, బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మత్తు పదార్థాలు సమాజ మూలాలకు పెనుముప్పు

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** మత్తు పదార్థాలు సమాజ మూలాలకు పెనుముప్పు అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సిబ్బందితో కలిసి మత్తు పదార్థాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా మంగళవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి రామారావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం సమాజాన్ని లోపం నుంచి దెబ్బతిసే ప్రమాదకరపు వ్యసనమని పేర్కొన్నారు. ముఖ్యంగా 15 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఎక్కువగా ఈ వ్యసనానికి గురవుతుండటం అత్యంత ఆందోళకరమని అన్నారు. మత్తు పదార్థాల ప్రభావం వల్ల చదువులో వెనుకబాటు, కుటుంబ కలహాలు, యువజీవితాన్ని పూర్తిగా దెబ్బతిస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలో కూడా అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి వివరించారు. నేరాల పెరుగుదల, హింసాత్మక ప్రవర్తన, ఆర్థిక నష్టం, కుటుంబ సంబంధాల దూరం కావడం, గ్రామస్థాయి లోపల శాంతి భద్రతలు భంగం చెందడం వంటి సమస్యలు మత్తు పదార్థాల దుర్వినియోగం వల్లే ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాల వ్యసనం నుండి బయటపడటం ఎందుకు కష్టమో కూడా వివరించారు. శరీరం అలవాటు పడటం, విడిచే సమయంలో వచ్చే తీవ్రమైన శారీరక, మానసీక లక్షణాలు, ఒత్తిడి, నిరాశ, ఒంటరితనం, అలాగే చెడు స్నేహితుల ప్రభావం వంటి కారణాలు వ్యక్తిని తిరిగి అదే వ్యసనంలోకి నెడుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ దుర్వినియోగాన్ని నివారించడానికి కుటుంబ సభ్యులు, ఆరోగ్యసిబ్బంది, సమాజం మొత్తం కలిసి పనిచేయాలని అన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు, మార్గదర్శక సమావేశాలు, యువతకు సరైన దిశానిర్దేశం ఇవ్వడం అత్యంత అవసరమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఎంఓ సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మోతీయ, జిల్లా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైరా బస్టాండ్‌లో రూ.1.80వేలు దొంగిలించిన గుర్తుతెలియని వ్యక్తులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా బస్టాండ్‌లో ప్రయాణీకులు బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు బ్యాగులో నుంచి రూ.1.80లక్షలు దొంగిలించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌లో ఉంటున్న వాగు శ్రీనివాసరావు పెళ్లికార్డులను బంధువులకు ఇచ్చుకుంటూ వైరా బస్టాండ్‌కి వచ్చి వారి స్వగ్రామమైన మధిర సమీపంలోని జొన్నలగడ్డ వెళ్లి బంధువులకు పెళ్లికార్డులు ఇచ్చేందుకు మధిర బస్ ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.80లక్షలు దొంగిలించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు బ్యాగులో డబ్బులు లేవు అని తెలిసి వైరా బస్టాండ్‌కి వచ్చి ఆర్‌డిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లో సిసి కెమెరాలు పనిచేయడం లేదని తెలపడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# కుమ్మర, శాలివాహన వన సమారాధన విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా, తల్లాడ కుమ్మర, శాలివాహన, ప్రజాపతి కెఎస్‌పి నిర్వహించిన కార్తీక మాస వనసమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కుల బంధువులకి ధన్యవాదాలు తెలియజేసిన కార్యక్రమం నిర్వాహకులు గుమ్మడిదల వెంకటనారాయణ, సంగెపు వెంకటేశ్వరరావు, విలాసాగరం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, దరిపల్లి మధు, సంగెపు కృష్ణ, దరిపల్లి శ్రీనివాసరావు, న్నాపురపు శ్రీను, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఇనగంటి ప్రసాద్, గుడిమెట్ల పుల్లారావు, కొత్తపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఇంత చక్కటి కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమం నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

**- సీనియర్ న్యాయవాది సి.దామోదర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ బార్ కౌన్సిల్‌కు త్వరలో జరగబోయే ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు ఇవ్వాలని సీనియర్ న్యాయవాది దామోదర్‌రెడ్డి కోరారు. మంగళవారం మధిర బార్ అసోసియేషన్ న్యాయవాదులందరినీ కలిసిన ఆయన ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ న్యాయవాదుల సమస్యలన్ని పరిష్కరిస్తామని, న్యాయవాదులపై తరచూ జరుగుతున్న దాడుల నేపథ్యంలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ చట్టం తీసుకు రావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పుల్లారావు మాట్లాడుతూ తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో దామోదర్‌రెడ్డి విజయం కోసం మనం అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. దామోదర్‌రెడ్డిని విజేతగా నిలపడానికి ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సుంకు మోహన్ దాస్, తుములూరి కృష్ణారావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, చావలి రామరాజు, కావూరి రమేష్, నెల్లూరి రవి, బైరవభట్ల శ్రీనివాసరావు, కోట జ్ఞానేష్, చావలి రామరాజు, గందం శ్రీనివాస్ పట్ట శ్రీనివాస్ తాళ్లూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లు కూల్చేసిన పేదలకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ఆదివారం అర్ధరాత్రి నిర్ధాక్షిణ్యంగా ఇళ్లు కూల్చేసిన నిరుపేదలకు న్యాయం చేయాలంటూ అశ్వారావుపేట తహశీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం సిపిఐనియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత ఐదారు సంవత్సరాలుగా పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన 200కుటుంబాల ప్రజలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు నిర్మించుకుని జీవనాన్ని కొనసాగిస్తూ వస్తున్నారని వారి ఇళ్లను ఆదివారం అర్ధరాత్రి ఎటువంటి సమాచారం లేకుండా అధికారులు నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయడం జరిగిందని, వారికి న్యాయం జరిగే వరకు ఈ నిరసన దీక్షను కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకల బుడితి చిరంజీవి, తుడుం దెబ్బ జిల్లా నాయకులు రవి సంఘీభావం తెలిపారు. వారు కూడా ఈ పోరాటంలో సిపిఐతో కలిసి ప్రయాణం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

# కవులు సమాజ సంపదతో సమానం



- కవిగా రాణించాలంటే అన్ని రంగాల్లో పట్టుండాలి
- గ్రంథాలయాభివృద్ధికి కృషి
- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కవులు, కళాకారులు ఈ సమాజ సంపదతో సమానమని, అలాంటి వారు ప్రపంచంలోని అన్ని రంగాలపై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని, అప్పుడే కవులుగా రాణించగలరని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా మంగళవారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఓ కవి కలం నుండి జాలువారే ప్రతీ సిరా చుక్క వెయి మెదళ్లను కదలించగలిగే శక్తిగా ఉండాలని, బడబాగ్నిని రగిలించే అక్షరానికి అంతటి మహత్తర శక్తి ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా కవులుగా ఉండటం ఎంతో అదృష్టమని, మీరు రాసే కవితలు, రచనలు రాబోయే రోజుల్లో చక్కటి ప్రాచుర్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. తనకు పుస్తక పఠనం అంటే ఎంతో ఇష్టమని, అనేక మందికవులు, రచయితలు రాసిన పుస్తకాలను చదివినట్లు చెప్పారు. విద్యార్థులు పుస్తక పఠనం పై మక్కువ పెంచుకోవాలని, పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు పుస్తకాలతో దోస్తీ చేస్తే మేలు జరుగుతుందని చెప్పారు. ఇంత ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయం అని, గ్రంథాలయానికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రంథాలయా భివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ కవులను సన్మానించారు. ముందుగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నలిగంటి శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి, ఎంపిడిఒ కార్యాలయ ఉద్యోగి అసోసియేట్ అధ్యక్షురాలు కె అంబిక, గ్రంథపాలకురాలు గుమ్మడి మణిమృధుల, మధుబాబు, వాణి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి : కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అంకితభావంతో ఉండాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణ పరిధి జ్యోతీరావుపూలే గురుకులం, కెటిపిఎస్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన అధికారులతో కలిసి సందర్శించి తనిఖీ చేశారు. అక్కడి వసతులను, భోజనం, తరగతి గదులను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకొన్నారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెపుతున్న పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. నిత్యం సామాజిక పరిస్థితులు, వస్తున్న మార్పుల పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు.కమ్యూనికేషన్ స్కిల్స్ పట్ల పూర్తి పట్టు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు కాయకష్టం చేసుకుంటూ, తమ బాధలు తమ పిల్లలను రావద్దకొని సరైన విద్యనందించటానికి నిత్యం పరితపిస్తుంటాని వారి ఆశయాలకు అనుగుణంగా ఉంటూ లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా ఉంటూ విద్యలో రాణించాలన్నారు. దీనికోసం ఉపాధ్యాయులు తగిన కృషి చయాలని, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అవసరమైన మౌళిక వసతుల కోసం ఎంఎల్‌ఏగా తన వంతు ఇగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి సతీష్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, సిఐ సతీష్, ఎస్ ఐలు సుమన్, జీవన్‌రాజ్, సిపిఐరాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసం శెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎంఈఓ రాంమూర్తి, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, గౌస్, పాఠశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గులాబీ సత్తా చాటాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ శ్రేణులు సత్తా చాటాలని ఇల్లందు మాజీ ఎంఎల్‌ఏ బానోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం జేకే కాలనీ బిఆర్‌ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు సతమతమవుతున్నారని, రేవంత్‌రెడ్డి సర్కార్ రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. లోకల్ బాడీ ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బిఆర్‌ఎస్ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆ దిశగా నాయకులు కార్యకర్తలు ముందుకు సాగి ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను తెలియజేస్తేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పు చేశామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలకు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీనినీ సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. పంచాయితీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా ముందు కెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇల్లందు నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు సిరివెరి సత్యనారాయణ, జెకే శ్రీను, శీలం రమేష్, దాస్యం, ప్రమోద్ కుమార్, దేరంగుల పోశం, ఘాజీ, సత్తల హరికృష్ణ, నిఖిల్, ఖమ్మంపాటి రేణుక, దేవీనాయక్, బావ్‌సింగ్, గిన్నారపు రాజేష్, ఇల్లందు పట్టణ మహిళా అధ్యక్షురాలు నెమలి, ధనలక్ష్మీ, ప్రధాన కార్యదర్శి కొక్కు సరిత, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

**ప్రజాపక్షం/ఇల్లందు:** మాదక ద్రవ్యాల నిరోధిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ శ్రీకాంత్ మా మారక ద్రవ్యాల నిరోధిక పోరాటంలో ప్రతి ఒక్కరు క్రియా శీలక పాత్ర పోషించాలని కోరారు. నాతో పాటు మీరందరూ డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరించాలని కోరారు. డ్రగ్సన్ బారిన పడకుండా ఉండటానికి మనకు మనమే ఆదర్శంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా కొనుగోలు చట్టరీత్యా నేరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో మన మందరం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## బిల్డింగ్ పనులు జాప్యం లేకుండా చేయించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు :** బిల్డింగ్ పనులను జాప్యం జరగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ అన్నారు. మంగళవారం భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే మోడల్ భవిత కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. కోతులకు ఆవాసంగా ఉన్న ప్రాంతం లో ఈ కేంద్రాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని, మరమ్మతుల సమయములోనైనా తన దృష్టికి ఎందుకు తీసుకు రాలేదని సిబ్బందిని ప్రశ్నించారు. చుట్టూ తిరిగి రాకుండా మెయిన్ రోడ్ నుండి భవిత కేంద్రానికి రహదారి ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. భవిత కేంద్రానికి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. మరుగుదొడ్లను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ముందుగా సూర్య తండా ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసీఆర్ ప్రోగ్రాం అమలు చేయనందుకు ఉపాధ్యాయుడు రమేష్ కు షోకాజ్ నోటీసు తో పాటు, 14 రోజుల వేతనం నిలుపుదల చేయాలని ఎంఈఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వాసవి దేవి, ఎంపీడీవో భాగ్యశ్రీ, తహ సిల్దార్ సిహెచ్ శేషగిరిరావు, ఎంపీఓ జీవిఎస్ నారాయణ, పిఆర్ఏఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్



**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)కే వెంకటేశ్వర్లు మంగళవారం ఇల్లందు ఏరియాలోని జెకె 5 ఓసీ నూతన జెకే కోల్‌మైన్ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా తొలుత జెకె ఓసీలోని సెక్యూరిటీ వ్యూ పాయింట్ నుండి సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను గురించి జీయం వి కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీయం కార్యాలయం విచ్చేసిన నూతన జెకె కోల్‌మైన్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలను పరిశీలించి రివ్యూ చేపట్టారు. నూతన ఓసికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేసి బొగ్గు రవాణా జరిగేటట్లు చూడాలని ఏరియా జీయంకు తెలిపారు. ఈకార్యక్రమంలో యస్వోటు జీయం రామస్వామి, జెకె పిఓ సీఆర్‌బి ప్రసాద్, ఏజీయం(ఐఈడి) గిరిధర్ రావు, ప్రభాకర్‌రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డిజీయం(సివిల్)రవి కుమార్, ఏరియా బొగ్గు నాణ్యతాధికారి రామదాసు, జెకె మేనేజర్ పి పూర్ణచందర్, ఇతర అధికారులు, దిలీప్ కుమార్, రామమూర్తి, అంజిరెడ్డి, శివ వీరకుమార్, సుధాకర్, నాగేశ్వరరావు, శ్యాం ప్రసాద్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రైతులకు అందుబాటులో ఉండే విధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వరికి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు అదనంగా ప్రతి క్వింటాకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మోరంపల్లిబంజర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, సొసైటీల ద్వారా సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ధాన్యంలో తేమశాతం 17కి మించకుండా ఉండాలని, బాగా ఎండబెట్టి తాలు మట్టి లేకుండా ఉండే విధంగా చూడాలని, తూకం వేసి ఆన్లైన్‌లో అప్లోడ్ కాగానే 24గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమచేస్తారని తెలిపారు. ఎ గ్రేడ్ మద్దతు ధర 2389 రూపాయలు, సన్నరకం ధాన్యంకు అదనంగా బోనస్ 500 రూపాయలు ఇస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ మాజీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మోరంపల్లిబంజర్ మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీ నారాయణరెడ్డి, తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్‌కుమార్, ఏడీఏ తాతారావు, ఏవో ఆర్ శంకర్, మండలంలోని వివిధ శాఖల అధికారులు, పినపాక నియోజకవర్గం బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, నాయకులు భజన ప్రసాద్ కుమార్, కైపు శ్రీనివాస్‌రెడ్డి, చల్లా వెంకటనారాయణ, మాజీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, పాషా, దాసరి సాంబ, చిప్పా రాజు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం ప్రధాన రహదారి కూడలిలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ వారు డ్రగ్, రాంగ్, న్యూడ్ కాల్స్ విషయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు ఏఎస్ఐ, పోలీస్ శాఖ ఇతర సిబ్బంది మాదక ద్రవ్యాల, తప్పుడు ఫోన్ కాల్స్ వంటి వాటి విషయంలో జాగ్రత్తలు చక్కగా వివరించారు. ప్రజలతో చక్కగా మమేకమైన, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, పత్రిక ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# సకల సౌకర్యాలతో నూతన బస్టాండ్

**- పాల్వంచ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎల్‌ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/పాల్వంచ:** సకల సౌకర్యాలతో, అన్ని హంగులతో పాల్వంచ బస్టాండ్‌ను నిర్మించబోతున్నామని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బస్టాండ్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా అసౌకర్యాలతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణీకులు కూనంనేని దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సంభంధిత అధికారులను నిలదీశారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రణాళికా ప్రకారంతో ప్రయాణీకుల సౌకర్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. నూతన బస్టాండ్ నిర్మాణం కోసం, వసతుల కల్పన కోసం, నిధుల కోసం తగిన ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయన్నారు. తాత్కాలిక ఉపశమనం పనులను పక్కన పెట్టి శాశ్వతంగా చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. నూతన హంగులతో సకల సౌకర్యాలతో పాల్వంచ బస్టాండ్‌ను ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకొస్తామని, ప్రజాల ప్రయాణాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించటానికి మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, డిఎస్‌పి. సతీష్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, ఆర్‌టిసి డిపో మేనేజర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లాకార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ,వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, పాల్వంచ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సతీష్, ఎస్‌ఐలు సుమన్, జీవన్‌రాజు, నాయకులు డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, చెరుకూరి శేఖర్‌బాబు, గౌస్‌పాషా, మున్సిపల్ డిఈ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవాలి





**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మండల పరిధి కిన్నెరసాని గిరిజన మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన జోనల్ స్థాయి క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా అశ్వారావుపేట, భద్రాచలం ఎంఎల్ఏలు జారె ఆదినారాయణ, తెల్లం వెంకటరావులతో కలిసి జ్యోతి ప్రజ్వల చేశారు. క్రీడాకారులచే క్రీడా జ్యోతిని అందుకొన్నారు. బెలూన్లను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఆర్చరీ, వాలీబాల్ తదితర క్రీడలను ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. బాలికల 800 మీటర్ల పరుగు పందెంలో కాచనపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు మొదటి, రెండవ స్థానాలు, మణుగూరుకు చెందిన బాలిక తృతీయ స్థానాలను కైవసం చేసుకొన్నారు. వీరికి పిఓ, ఎంఎల్ఏలు ప్రశంసా పత్రాలను అందజేశారు. మూడవ స్థానంలో నిలచిన విద్యార్థికి ఎంఎల్ఏ జారె ఆదినారాయణ నగదు బహుమతిని అందజేశారు.అనంతరం జరిగిన సభలో ఐటిడిఏ పిఓ బి. రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి డైట్ మెనూ కోసం 40 శాతం, కాస్మొటిక్స్ కోసం 200 శాతం పెంచిందన్నారు. దీనితో పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుపై శ్రద్ధ వహిస్తారని అన్నారు. చదువుతో పాటుగా క్రీడల్లో ప్రతిభ కనభరిచి జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు. తద్వారా ఐటిడిఏకు, పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు ఐక్యతకు చిహ్నాలుగా నిలవాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమేనని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఐటిడిఏ పరిధిలోని విద్యాలయాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. పదవ తరగతిలో వందశాతం ఫలితాలను సాధించటానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ లక్ష్యాలను సాధిస్తున్నామని తెలిపారు.వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, రన్నింగ్ వంటి క్రీడలే కాకుండా నూతనంగా హాండ్ బాల్, సాఫ్ట్ బాల్, పవర్ లిఫ్టింగ్ లాంటి క్రీడల్లో విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నామని అన్నారు. క్రీడల్లో మంచి ఫలితాలను సాధించటానికి క్రీడాకారులను ప్రోత్సహించి వెన్నుతట్టాలను సంభంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ డిడి , ఏటిడబ్లూఓ చంద్రమోహన్, క్రీడల అధికారి బొగ్గా గోపాల్‌రావు, పిడిలు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఖమ్మం :** అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం లెనిన్ నగర్ ప్రాంతానికి చెందిన బహునూతల శ్రీధర్ (57) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్న సమయంలో ఖమ్మం స్తంభాద్రి గుట్టపైకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు ప్రణయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సిపిఐ నాయకుడు తిరుమలయ్య మృతి



**ప్రజాపక్షం/వైరా:** సిపిఐ సీనియర్ నాయకుడు వైరా మండల కార్యవర్గ సభ్యులు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సభ్యులు తిరుమలయ్య (75) అనారోగ్యంతో మంగళవారం గొల్లపూడి గ్రామంలో మరణించారు. విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు యర్రా బాబు, యామాల గోపాలరావు, మండల పార్టీ కౌన్సిల్ సభ్యులు కార్యవర్గ సభ్యులు గొల్లపూడి గ్రామంలో తిరుమలయ్య ఇంటికి వెళ్లి తిరుమల పార్థివదేహంపై పతాకాన్ని కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యర్రా బాబు మాట్లాడుతూ కామ్రేడ్ తిరుమల నిబద్ధత ఒక కమిట్‌మెంట్ కలిగిన వ్యక్తి పార్టీ అంటే ఎంతో ప్రమఅప్యాయత సూచన వ్యక్తి తాను మరణించేంత వరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతూ ఇతరులకు ఆదర్శంగా నిలబడిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి యామాల గోపాలరావు, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, మండల సహాయ కార్యదర్శి మూట కొండ, రైతు సంఘం నాయకులు కొండా రామకృష్ణ, బండారుపల్లి ముత్తయ్య, ఏఐటియుసి నాయకులు రాయపూడి శ్రీను, గజ్జల శ్రీనివాసరావు, రాంబాబు, యాకూబ్‌అలి, షేక్ ఇబ్రహీం, ఓర్సు నర్సింహారావు, అమరనేని పరశురాములు, అడుసుమల్లి శివప్రసాదరావు, రేమల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్క దాడిలో చిన్నారులకు గాయాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని హనుమ తండా గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన కుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో ఒకరు ఖమ్మం, మరొకరు హైదరాబాద్ తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి... హనుమతండ గ్రామంలో గృహం ముందు ఆడుకుంటూ ఉండగా బానోతు పల్లవి ఒకటిన్నర సంవత్సరం, బానోతు ధమని నాలుగు సంవత్సరాలు, ఇరువురు గృహాల ముందు ఆడుకుంటూ ఉండగా వీధి కుక్క ఒకేసారి ఒకరి తర్వాత ఒకరు పై దాడి చేయడంతో చిన్నారులు కేకలు వేయడం వలన ఇరుగుపొరుగువారు కుక్కలను వెంటాడటంతో కుక్కలు పరిగెత్తాయి. వెంటనే తల్లిదండ్రులు సమీప ఆసుపత్రికి తరలించడంతో పరిస్థితి విష మించటం వలన బానోత్ దామని ని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. పల్లవిని ఖమ్మం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కలు భయంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుక్కల నియంత్రణకు ప్రణాళికలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులను కోరుతున్నారు.

# రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఖోఖో విజేతలు వీరే



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని మంగళవారం జిల్లాస్థాయి కో కో క్రీడలు మినీ స్టేడియం ఆవరణలో జరిగాయి. మొదటి స్థానం మధిర జట్టు, రెండవ స్థానం ఎర్రుపాలెం జట్టు, మూడో స్థానం చింతకాని టీములు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చందరరావు, ఎంఈఓ నివేదిత. మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవిలు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భీమ వీర రాఘవయ్య లతోపాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో పాల్గొనే ఖోఖో క్రీడల్లో పాల్గొంటున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

# సాయిస్ఫూర్తిలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నషాముక్తు భారత్ అభియాన్ 5(ఐదు) సంవత్సరాలు మాదకద్రవ్యాల వినియోగం, నివారణపై అవగాహన సదస్సును మంగళవారం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్(ఐసిడిఎస్), కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ ఎస్ ఎస్) వారి సంయుక్తాధ్వర్యంలో యువతకు అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యాల దుర్వినియోగంపై కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బలుసుపాటి సీతారాములు నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్) సూపర్వైజర్స్ ఈ.గంగాజలం, వి.సుజాత, ఆర్. రజనీ, ఎన్ రమాదేవి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వూటుకూరి శేషారత్నకుమారి, కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డా. షేక్.మీరాసాహెబ్, అన్నిఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, కార్యాలయ సిబ్బంది ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కళాశాల విద్యార్థినికి స్వర్ణ, రజత పతకాలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్‌కె అమ్రిన్ ఈనెల 14 నుండి 16 వరకు హైదరాబాద్‌లోని జింఖాన్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడలలో జావెలిన్ త్రో లో స్వర్ణ పతకం, షాట్ పుట్‌లో రజత పతకాన్ని సాధించింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నెల్లూరు శేషు బాబు అధ్యాపకులు ఆమె ప్రతిభను అభినందిస్తూ కోచ్ గిరి ప్రసాద్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన అమ్రిన్ కాలేజీకి గౌరవం తీసుకొచ్చిందని అన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ మధిర :** పాలేరు డివిజన్‌లో ఈనెల 20వ తేదీన జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదంచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పొనుకుల సుధాకర్, మాజీ రాష్ట్ర నాయకులు మంద సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ మధిర డివిజన్ మహాసభ నిర్వహించగా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ముంగి గోపిచంద్, మర్రి సాయికుమార్, 20మందిసభయలతో డివిజన్ కమిటీని ఎన్నుకోవటం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అని అన్నారు. ఈనెల 20న పాలేరు డివిజన్‌లో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులను, ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని, హాస్టళ్ల మెస్ బిల్లులు పెంచాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు షేక్.పండు, మోరబోయిన నాగరాజు, బోడ వెంకట్, సిహెచ్.రాజు, మహేష్, మణిదీప్, జీడిమెట్ల సతీష్, తాటికొండ శివ, వేముల మహేశ్, వేణుగోపాల్, వెంకటకృష్ణ, నిశత, కీర్తన, గాయత్రీ, నాగలక్ష్మి హామీదా తదితరులు పాల్గొన్నారు.